నేడు జడ్పీ సమావేశం

కామారెడ్డి, జూన్ 6 : జడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ అధ్యక్షతన శుక్రవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు జడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి చందర్ నాయక్ గురు వారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు, అధికారులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని ఆయన సూచిం చారు. అధికారులు సమగ్ర వివరాలతో సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

ఎంపీడీవో, ఎంపీవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

బీబీపేట్, జూన్ 6 : గ్రామ పంచాయతీ నిధులు మంజూరు చేయాలని బీబీపేట్ మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్, ఎంపీవో కృష్ణకు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల నిర్వహణకు నిధులు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరారు. గ్రామాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి నిధులు రావడం లేదన్నారు. పంచాయతీల నిర్వహణ ఇబ్బందికరంగా మారిందన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పండుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేసేలా చూడాలని ఎంపీడీవో, ఎంపీవోకు వినతి పత్రాన్ని అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు రమేశ్, ఇంతియాజ్, నవీన్, భరత్, వెంకటస్వామి, బాలకృష్ణాగౌడ్, కల్యాణ్, రమేశ్, వెన్నెల పాల్గొన్నారు.

చెరువు తూమును ఎత్తిన గుర్తు తెలియని వ్యక్తులు

నస్రుల్లాబాద్, జూన్ 6 : బీర్కూర్, కిష్టాపూర్ గ్రామాల మధ్య ఉన్న పెద్ద చెరువు తూమును గురువారం గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తి వేశారు. చెరువు నుంచి నీరు పంట పొలాల్లోకి వృథాగా వెళ్లడంతో సుమారు 100 ఎకరాల పరినారు నీట మునిగిందని రైతులు తెలిపారు. చెరువు తూమును రైతులు ఇసుక సంచులతో మూసివేశారు.

ఇంటి నంబర్‌ను తీసుకోవాలి

కామారెడ్డి, జూన్ 6 : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవి విహార్, దేవునిపల్లిలో నూతనంగా నిర్మించుకున్న ఇండ్లను గురువారం మున్సిపల్ కమిషనర్ సుజాత పరిశీలించారు. ఇంటి నంబర్ లేని వాటికి ఇంటి నంబర్లు వెంటనే కేటాయించేందుకు రెవెన్యూ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఇంటి నంబర్లు లేని వాటికి కొలతల ప్రకారం ఇంటి పన్ను విధించారు. కార్యక్రమంలో ఆర్ఐ జానయ్య, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

అడ్డగోలుగా మట్టి అక్రమ రవాణా

- చెరువుల్లో జేసీబీలతో భారీ గొయ్యిలు తవ్వి టిప్పర్లలో మట్టి తరలింపు
- పశువులు, గ్రామస్తులకు ప్రమాదకరంగా మారిన గొయ్యిలు
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న ఇరిగేషన్ అధికారులు

చెరువులో ప్రమాదకర స్థాయిలో లోతైన గుంతలు

బాన్సువాడ రూరల్, జూన్ 6 : గత ప్రభుత్వం మిషన్‌కాకతీయ పథకంతో చెరువులను బాగు చేసి సాగు నీరందించగా, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల సమన్వయ లోపంతో మట్టి వ్యాపారులకు చెరువులోని పూడికతీత వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతున్నది. బాన్సువాడ మండలంలోని కోనాపూర్ గ్రామ చెరువులో పదుల సంఖ్యలో జేసీబీలు మట్టి తవ్వకంలో పని చేస్తున్నాయి. ట్రాక్టర్లు, టిప్పర్లలో మట్టిని తరలించి అమ్ముకుంటూ లాభాలను ఆర్జిస్తున్నారు. కొన్ని రోజులుగా చెరువులో జేసీబీలు, ట్రాక్టర్లు, టిప్పర్లతో జాతరను తలపిస్తున్నది. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారీతిలో మట్టిని తవ్వుతూ భవిష్యత్‌లో జీవాలు, గ్రామస్తులకు పెను ప్రమాదంగా మారాయి. చెరువు అంచునలో తైన గోతులను తవ్వుతూ మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. చెరువులను కాపాడాల్సిన ఇరిగేషన్ అధికారులు ఇంత పెద్ద ఎత్తున మట్టిని తరలిస్తున్నా పట్టించుకోకపోవడంపై కోనాపూర్ గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరు రైతులు మట్టిని పొలాల్లో వేసుకుంటున్నప్పటికీ, గాంధారి మండలానికి చెందిన కొందరూ వ్యాపారులు టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు.

రాత్రింబవళ్లు మట్టి తరలింపు..

చెరువు మట్టికి మంచి డిమాండ్ ఉండడంతో కొందరు మట్టి వ్యాపారులు రైతులను ఆసరాగా చేసుకొని రాత్రింబవళ్లు చెరువులో తిష్టవేసి జేసీబీలతో మట్టిని తవ్వి టిప్పర్లతో రవాణా చేస్తున్నారు. గాంధారి మండలానికి చెందిన కొందరు ఎక్కువ కెపాసిటీ ఉన్న జేసీబీలను తీసుకొచ్చి టిప్పర్ల ద్వారా మట్టిని అమ్ముకుంటూ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఇతర మండలాలకు చెందిన వారు వచ్చి చెరువులో నుంచి యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు అధికారుల తీరుపై మండి పడితున్నారు. పొలాలోకి మట్టి తీసుకెళ్తున్న రైతులను కాకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై అధికారుల చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సంబంధిత జిల్లా అధికారులు చొరవ తీసుకొని అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోని చెరువును కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కోనాపూర్ చెరువులో భారీ సంఖ్యలో జేసీబీలతో మట్టిని తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న దృశ్యం

అనుమతులు ఇవ్వలేదు

చెరువులలో మట్టి తవ్వకానికి మండలంలో ఎక్కడా అనుమతులు ఇవ్వలేదు. చెరువు పర్యవేక్షణను పూర్తిగా ఇరిగేషన్‌శాఖ అధికారులే చూసుకుంటున్నారు. రెవెన్యూ అధికారులకు సంబంధం లేదు. చెరువుల్లో నుంచి మట్టిని అక్రమంగా తరలించడం తప్పు. రైతులు పొలాల్లో వేసేందుకు ఒక క్రమపద్ధతిలో మట్టిని తవ్వ తీసుకెళ్లాల్సి ఉంటుంది. చెరువుల బాధ్యత ఇరిగేషన్ అధికారు చూసుకుంటున్నారు.

- వరప్రసాద్,
తహసీల్దార్, బాన్సువాడ

రైతుల కోసం కల్లాలు నిర్మిస్తాం

జంగంపల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

భిక్కనూరు, జూన్ 6 : గ్రామాల్లో రైతుల కోసం కల్లాలు నిర్మిస్తామని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. భిక్కనూరు మండలంలోని పలు గ్రామాల్లో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రైతులు పంటలు ఆరబెట్టేందుకు గ్రామాల్లో కల్లాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు రమేశ్, జంగంపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు తిర్మల్, నాయకులు ప్రవీణ్ గౌడ్. మోహన్‌రెడ్డి, రాములు, నాగభూషణం, భాస్కర్ చారి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు ఉన్న పాఠశాలలోనే విద్యార్థులను చేర్చించాలి

కామారెడ్డి, జూన్ 6 : జిల్లాలోని విద్యార్థుల తల్లిదండ్రులు కామారెడ్డిలో ప్రస్తుతం నడుస్తున్న ప్రెసిడెన్షియల్ ప్రైమ్ స్కూల్, ఛాంపియన్స్ స్కూల్, సదాశివనగర్‌లోని ఇండియన్ పబ్లిక్ స్కూల్‌కు ప్రభుత్వ గుర్తింపు లేదని డీఈవో రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుర్తింపు లేని పాఠశాలల్లో పిల్లలను చేర్చే ముందు సంబంధిత మండల విద్యాశాఖాధికారిని సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకొని అడ్మిషన్ తీసుకోవాలని తెలిపారు. విద్యాధికారులను సంప్రదించకుండా ఇష్టానుసారంగా ప్రైవేట్ పాఠశాలలో చేర్పించినట్లయితే తర్వాత జరిగే పరిణామాలకు తల్లిదండ్రులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు.

సుఖ ప్రసవాలపై అవగాహన

బాన్సువాడ టౌన్, జూన్ 6 : యోగా, శారీరక వ్యాయామంతో ఎక్కువ శాతం సుఖ ప్రసవాలు చేయవచ్చని బాన్సువాడ మాతా–శిశు దవాఖాన నర్సు, యోగా శిక్షకురాలు సాయవ్వ తెలిపారు. బాన్సువాడ మాతా–శిశు దవాఖానకు వచ్చే గర్భిణులకు సుఖ ప్రసవాల గురించి అవగాహన గురువారం కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు సరైన మోతాదులో ద్రవ పదార్థాలు తీసుకోవాలన్నారు. శిక్షకురాలి పర్యవేక్షణలో చిన్న చిన్న శారీరక వ్యాయామం చేయాలని చెప్పారు. ప్రతిరోజు నడవడంతోపాటు మానసిక ప్రశాంతంగా ఉండడంతో సుఖ ప్రసవం అయ్యేందుకు ఎక్కువ శాతం అవకాశాలు ఉంటాయని గర్భిణులకు వివరించారు. ఇంటి వద్ద పాటించాల్సిన యోగా, శారీరక వ్యాయామాలను వారికి నేర్పించారు. కార్యక్రమంలో నర్సు యమున, సిబ్బంది కళ్యాణి, గర్భిణులు పాల్గొన్నారు.

ఆశవర్కర్లు అంకితభావంతో పని చేయాలి

భిక్కనూరు, జూన్ 6 : ఆశ వర్కర్లు అంకిత భావంతో పనిచేయాలని మండల వైద్యాధికారిణి హేమిమా అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ వర్కర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కుటుంబ నియంత్రణ, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి వెంకటరమణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బాన్సువాడలో ఎరువులను తీసుకెళ్తున్న రైతులు

సాగుకు రైతులు సన్నద్ధం

బాన్సువాడ, జూన్ 6 : వానకాలం పంటలు వేసుకునేందుకు రైతులు సిద్ధం అవుతున్నారు. ఇప్పటికే దుక్కులు దున్నిన రైతులు బోరుబావుల వద్ద సాగునీరు వసతి ఉన్నవారు నారుమడులు వేశారు. ఎప్పుడు వరణుడు కరుణించినా నాట్లు వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే వాతావరణం చల్లబడడంతో విత్తనాలు, ఎరువుల దుకాణాల వద్ద రైతులు ఎరువుల సంచులు కొనుగోలు పనుల్లో నిమగ్నమయ్యారు. బాన్సువాడ మండలంలోని కొల్లూర్, పోచారం, రాంపూర్, తండా, వర్ని మండలం, కోటగిరి, పొతంగల్ మండలంలోని ఆయా గ్రామాల్లో నారుమడులు ముందస్తుగా వేయడంతో నాట్లకు సిద్ధంగా ఉన్నామని, నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి సాగునీరు వదలడంతో వరి నాట్లు ప్రారంభం అవుతాయని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగాల కోసం 10న ఇంటర్వ్యూలు

కామారెడ్డి, జూన్ 6 : ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ నెల 10న కలెక్టరేట్‌లోని ఉపాధి కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పనాధికారి మధుసూదన్ రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి పట్టణంలోని వరుణ్ మోటార్స్ కంపెనీలో పలు పోస్టులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోస్టులకు 25 నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సు కలిగి ఇంటర్, మెకానిక్ ట్రేడ్‌లో డిప్లమా, ఏదేని డిగ్రీ, బీటెక్ అర్హత కలిగి ఉండాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.14 వేల నుంచి 25 వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. జిల్లాకు చెందిన ఆసక్తి ఉన్న నిరుద్యోగులు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని 121 గదిలో ఉపాధి కల్పనా కార్యాలయంలో విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, ఫొటోలతో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9848237987, 7671974009 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

స్టాక్ వివరాలను నమోదు చేయాలి

రికార్డును పరిశీలిస్తున్న ఏవో హరీశ్‌కుమార్

ఎల్లారెడ్డి, జూన్ 6: ఫర్టిలైజర్ దుకాణాల డీలర్లు ప్రతి రోజూ స్టాక్ వివరాలను నమోదు చేయాలని మండల వ్యవసాయాధికారి హరీశ్‌కుమార్ సూచించారు. ఎల్లారెడ్డి పట్టణంలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. ఏయే రకాల పంటల విత్తనాలు ఎవరికి, ఎన్ని బ్యాగులు విక్రయించారనే విషయాలను తప్పకుండా రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. వివరాలను విధిగా వ్యవసాయ శాఖ వారికి అందజేయాలని సూచించారు. నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని, రైతులకు రసీదులు అందజేయాలన్నారు.

మరమ్మతు పనుల పరిశీలన

పనులను పరిశీలిస్తున్న సీసీ దత్తు

నాగిరెడ్డిపేట, జూన్ 6: మండలంలోని మాల్తుమ్మెద గ్రామ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లోఅమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న మరమ్మతు పనులను ఐకేపీ సీసీ దత్తు గురువారం పరిశీలించారు. పనుల వివరాలను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు మంగమ్మను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని బాలికలు, బాలుర ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలల్లో రూ.4.15 లక్షలతో మరమ్మతు పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. పనుల వివరాలను నీటిపారుదల శాఖ ఏఈ అరుణ ప్రభకు తెలియజేస్తామన్నారు.

బోరుబావి గుంతలో పడ్డ ఆవు

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 6: లింగంపేట మండలంలోని పోతాయిపల్లి గ్రామంలో బోరుబావి కోసం తవ్విన గుంతలో ఆవు పడిపోయింది. వివరాలు ఇలా ఉన్నాయి. పోతాయిపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు తన పొలంలో బోరుబావి త్రవ్వించాడు. నీళ్లు పడకపోవడంతో దానికి వేసిన కేసింగ్ తీసి గుంతను పూడ్చకుండా వదిలేశాడు. బుధవారం కురిసిన వర్షానికి ఆ గుంతలో నీళ్లు నిండాయి. గురువారం ఉదయం మేతకోసం వెళ్లిన ఆవు ఆ గుంతలో పడింది. స్థానికులు చూసి దానిని బయటికి తీశారు. ఇప్పటికైనా రైతు బోరుబావి గుంతలను పూడ్చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు మీసాన్‌పల్లిలో బోనాల పండుగ

ఎల్లారెడ్డి, జూన్ 6: మండలంలోని మీసాన్‌పల్లి గ్రామంలో శుక్రవారం బోనాల పండుగను నిర్వహించనున్నట్లు గ్రామ మాజీ సర్పంచ్ బోండ్ల సాయిలు గురువారం తెలిపారు. ఆనవాయితీ ప్రకారం పండుగను నిర్వహిస్తున్నామని, ప్రతి ఇంటి నుంచి బోనాలను తీసి అమ్మవారికి సమర్పిస్తామని పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, **GOUSE MIYA,** R/o. H.No.1-114, Dongli, (M) Madnoor, (D) Kamareddy Changed my name as **SHAIK GOUSE MIYA S/o. SHAIK BABU MIYA**

NTZ-324890

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రైవేటు వద్దు - ప్రభుత్వ పాఠశాలలే ముద్దు

- అట్టహాసంగా బడిబాట ప్రారంభం
- గ్రామాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల ర్యాలీలు

కళ్యాణి గ్రామంలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

దోమకొండలో ఉపాధ్యాయులు..

ఎల్లారెడ్డి రూరల్/ రామారెడ్డి/ నాగిరెడ్డిపేట/ దోమకొండ/ పెద్దకొడప్గల్, జూన్ 6: డబ్బులు వెచ్చించే ప్రైవేట్ పాఠశాలలు వద్దని, ప్రభుత్వ బడుల్లోనే పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు సూచించారు. బడిబాట కార్యక్రమం జిల్లావ్యాప్తంగా గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీలు తీశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ప్రభుత్వ బడుల్లోనే సర్కారు అన్ని సౌకర్యాలను కల్పిస్తుందని, నాణ్యమైన విద్యాబోధన ఉంటుందని ఉపాధ్యాయులు అన్నారు. ఎల్లారెడ్డి మండలం కళ్యాణి గ్రామంలో నిర్వహించిన బడిబాటలో జడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, రవి, ఉపాధ్యాయులు బాల్‌కిషన్, వీరయ్య, సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, అరుణశ్రీ, కైలాస్ తదితరులు పాల్గొన్నారు. రామారెడ్డి మండలంలోని పలు గ్రామాల్లో బడిబాట సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు ప్రార్థన చేయించారు. పాఠశాలల్లోని వసతులను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్లు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని పలు గ్రామాల్లో బడిబాట నిర్వహించినట్లు ఎంఈవో వెంకటేశం తెలిపారు. పాఠశాలల ఆవరణలో ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు కలిసి ప్రతిజ్ఞ చేశారు. సీఆర్పీ రాజు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. దోమకొండ బాలుర ఉన్నత పాఠశాలలో సమావేశాన్ని నిర్వహించి ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తీర్మానం చేశారు. అనంతరం బడిబాట ప్రతిజ్ఞ చేశారు. ఎస్సెస్సీలో 10జీపీఏ సాధించిన శ్రీశాంత్‌కు శాలువా కప్పి సన్మానించారు. పెద్దకొడప్‌గల్, కాటేపల్లి గ్రామాల్లో ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ చదువు ఆవశ్యకతను తల్లిదండ్రులకు వివరించారు. చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఉపాధ్యాయులు కిషన్, సుజాత, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట ప్రాథమికోన్నత పాఠశాలలో..

ఇసన్నపల్లిలో విద్యార్థుల తల్లిదండ్రులు..

గోపాల్‌పేటలో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

మూలమలుపు.. ప్రమాదాలకు పిలుపు

నాగిరెడ్డిపేట, జూన్ 6: మండల కేంద్రం గోపాల్‌పేట నుంచి నాగిరెడ్డిపేట గ్రామానికి వెళ్లే రోడ్డు మూల మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోపాల్‌పేట నుంచి బోధన్ – హైదరాబాద్ రహదారిపై పోచారం ప్రాజెక్టు ప్రధాన కాలువను ఆనుకొని నాగిరెడ్డిపేట గ్రామానికి వెళ్లే రోడ్డు ఉంది. ప్రధాన కాలువ వంతెన ఇరుకుగా ఉండడంతో గ్రామం నుంచి వచ్చి వెళ్తున్న సమయంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని గ్రామస్తులు తెలిపారు. 20రోజుల కిత్రం గ్రామం నుంచి రోడ్డుపైకి వచ్చిన ద్విచక్రవాహనాన్ని తప్పించబోయిన కారు కల్వర్టును ఢీకొని బ్రిడ్జి అంచు వరకు వెళ్లి ఆగింది. దీంతో తృటితో పెనుప్రమాదం నుంచి ఐదుగురు వ్యక్తులు ప్రాణాలతో బయట పడ్డారు. బ్రిడ్జి వద్ద కనీసం సూచిక బోర్డు కూడా ఏర్పాటు చేయలేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ ప్రదేశంలో ఇప్పటి వరకు పదుల సంఖ్యలో ప్రమాదాలు చోటు చేసుకున్నాయని, పలువురికి తీవ్ర గాయాలకు కాగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇకనైనా అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

స్తంభం పైనుంచి పడి లైన్‌మన్ మృతి

నిజాంసాగర్, జూన్ 6: స్తంభం పైనుంచి కాలుజారి పడి లైన్‌మన్ మృతిచెందిన ఘటన మండలంలోని అచ్చంపేట గ్రామంలో గురువారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. భిక్కనూరు మండలం పెద్ద మల్లారెడ్డికి చెందిన సంతోష్(35) అచ్చంపేట్ గ్రామంలో జూనియర్ లైన్‌మన్‌గా విధులను నిర్వహిస్తున్నాడు. గ్రామంలోని నవోదయ విద్యాలయం వద్ద విద్యుత్ సమస్య ఏర్పడింది. స్తంభం పైకి ఎక్కిన అతడు మరమ్మతులు చేస్తున్నాడు. ఈ క్రమంలో కాలుజారి కింద పడి మృతిచెందాడు. అతడు ఆరేండ్లుగా మండలంలో విధులు నిర్వహిస్తున్నాడని గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య సావిత్రి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.